క్లుప్తంగా

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా



మద్నూర్(జుక్కల్) : మండల కేంద్రంలోని రథ్‌గల్లీలో బోరు మోటార్ చెడిపోవడంతో కాలనీలో కుళాయిల ద్వారా వచ్చే తాగునీటి సరఫరా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు శుక్రవారం రెండు ట్యాంకర్లను పెట్టి కాలనీవాసుల తాగునీటి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు యాదవ్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ తీగలపై చెట్ల కొమ్మలు



కామారెడ్డి రూరల్ : మూడు రోజుల క్రితం ఈదురు గాలులతో కూడిన వర్షానికి కామారెడ్డి మండలం ఉగ్రవాయి గ్రామ శివారులోని నల్లకుంట మైసమ్మ ఆలయ సమీపంలోని కామారెడ్డి–సిరిసిల్లా రోడ్డు ప్రధాన రహదారిపై చెట్టు కొమ్మలు విరిగి పడి అలాగే ఉండిపోయాయి. దీంతో గ్రామంలో కరెంట్ లేక రెండు రోజుల పాటు గ్రామమంతా అంధకారంలో ఉండి. శుక్రవారం సాయంత్రం ట్రాన్స్‌కో అధికారులు చెట్ల కొమ్మల తీసివేసి కరెంట్ పునరుద్ధరించినట్లు గ్రామస్తులు తెలిపారు. అలాగే రామేశ్వర్‌పల్లి, క్యాసంపల్లి తండా గ్రామాల్లో కూడా కరెంట్ లేదని గ్రామస్తులు తెలిపారు.

నియామకం



కామారెడ్డి అర్బన్ : కామారెడ్డికి చెందిన న్యాయవాది, సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీంను మానవ హక్కుల సంఘం న్యాయ విభాగం జాతీయ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. హైదరాబాద్ బషీర్‌భాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో జాతీయ అధ్యక్షుడు సోనుసింగ్ భరత్ సలీంకు నియమాక పత్రాన్ని అందజేసి సన్మానించారు.

ముగ్గుతో ఓటు హక్కుపై అవగాహన



మద్నూర్(జుక్కల్) : ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరుతూ మండల కేంద్రంలో శుక్రవారం వడ్డేవార్ ధనశ్రీ ముగ్గు వేసి కోరారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ధనశ్రీ తన ఇంటి ముందు ఓటర్లను చైతన్యం పరిచేలా ముగ్గు వేసింది. ఈనెల 13న తప్పకుండా ఓటు వేయాలని కోరుతు ఎన్నికల కమిషన్ చిహ్నంతో ముగ్గు వేశారు.

కాంగ్రెస్‌కే సీపీఐ మద్దతు



కామారెడ్డి టౌన్ : పార్లమెంట్ ఎన్నికల్లో సీపీఐ పార్టీ కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు తెలుపుతుందని సీపీఐ రాష్ట్ర నాయకుడు వీఎల్ నర్సింహారెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ప్రైవేట్, కార్పొరేట్ శక్తులకు ప్రధాని మోదీ వత్తాసు పలుకుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎల్.దశరత్, సహాయ కార్యదర్శి బాల్‌రాజు, నాయకులు ప్రవీణ్, రాజు తదితరులున్నారు.

రాజ్యాంగాన్ని మారుస్తామంటే ఊరుకోం



లింగంపేట(ఎల్లారెడ్డి) : రాజ్యాంగానికి సవరణలు చేసి ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేయడానికి కుట్ర చేస్తే సహించేది లేదని భారత రాజ్యాంగ పరిరక్షణ కమిటీ సభ్యుడు, జిల్లా అంబేడ్కర్ గౌరవ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లన్న వెల్లడించారు. శుక్రవారం లింగంపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 'భారత్ జోడో అభియాన్' కరపత్రాలను ఆవిష్కరించారు. డీసీసీబీ డైరెక్టర్ సాయికుమార్, ఆర్యక్షత్రీయ సంఘం రాష్ట్ర నాయకుడు మధుసూదన్‌రావు, టీపీసీసీ మైనార్టీ జనరల్ సెక్రటరీ రఫీయోద్దీన్, రాష్ట్ర మైనార్టీ నాయకుడు ఫతియోద్దీన్ తదితరులున్నారు.





బస్వాపూర్‌లో బసవేశ్వర విగ్రహానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, ఎల్లారెడ్డిలో..



పెద్దకొడప్‌గల్‌లో..

ఘనంగా బసవేశ్వర జయంతి



మద్నూర్‌లో..



ఖంబపూర్‌లో బసవేశ్వరుడి చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న లింగాయత్‌లు

పిట్లం(జుక్కల్) : మండలంలోని ఖంబపూర్‌లో విశ్వగురువు బసవేశ్వరుని జయంతిని శుక్రవారం ఘనంగా నిరహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్థులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

బస్వాపూర్‌లో..

నిజాంసాగర్(జుక్కల్) : జుక్కల్ మండలంలోని బస్వాపూర్‌లో శుక్రవారం బసవ జయంతిని ఘనంగా నిర్వహించారు. జయంతి ఉత్సవాలకు ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమేశ్ దేశాయ్, అస్వత్‌వార్ వినోద్, సాయిలు తదితరులు ఉన్నారు.

పెద్దకొడప్‌గల్‌లో..

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మహాత్మా బసవేశ్వరుడు అందరివాడని వీరశైవ లింగాయత్ జిల్లా కార్యదర్శి మల్లప్ప పటేల్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు కాటేపల్లి గ్రామాల్లో బసవేశ్వర జయంతిలో భాగంగా బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ జిల్లా కార్యదర్శి మల్లప్ప పటేల్, సొసైటీ చైర్మన్ హన్మంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, లింగాయుత్ సంఘ సభ్యులు మాధవ్ రావ్,బస్వరాజ్ తదితరులున్నారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి రూరల్(ఎల్లారెడ్డి) : పట్టణంలోని నీలకంఠేశ్వరాలయంలో శుక్రవారం బసవేశ్వర జయంతిని ఘనంగా నిర్వహించారు. శివాలయంలో ప్రత్యేకంగా పూజలను నిర్వహించిన అనంతరం బసవేశ్వరుడి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సంఘం అధ్యక్షులు ముత్తి వీరప్ప, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్‌లో..

మద్నూర్(జుక్కల్) : మద్నూర్, డోంగ్లీ మండలాల్లో శుక్రవారం మహాత్మ బసవేశ్వర జయంతిని ఘనంగా నిర్వహించారు. మద్నూర్ మండల కేంద్రంలో, డోంగ్లీ మండలంలోని మొగాలో లింగాయత్‌లు బసవేశ్వర జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లింగాయత్ సమాజ్ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే రాష్ట్రాభివృద్ధి





కరడ్‌పల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, బాన్సువాడలో..



లింగంపేట మండలంలో..



బోర్లంలో..

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా నాయకులు ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ హయాంలోనే హామీలన్నీ నెరవేర్చబడ్డాయన్నారు. మళ్లీ బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని నాయకులు కోరారు.



దోమకొండలో..



సరంపల్లిలో..



ఘన్‌పూర్‌లో..

ఆధ్యాత్మికం

ఆలయ అభివృద్ధికి విరాళం



మాచారెడ్డి : మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయ అభివృద్ధి కోసం హైదరాబాద్‌కు చెందిన వెన్ను యాదవరావు, రుక్మిణి దంపతులు శుక్రవారం రూ.1,01,000 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిట్ చైర్మన్ కమలాకర్ రెడ్డి దాతలకు స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ డైరెక్టర్ నర్సయ్య, సిబ్బంది సంతోష్ కుమార్, లక్ష్మణ్ అర్చకులు నరసింహాచార్యులు, శ్రీనివాసాచార్యులు తదితరులున్నారు.

శబరిమాత ఆశ్రమంలో పల్లకీ సేవ



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమంలో శుక్రవారం భక్తులు పల్లకీసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. శబరిమాత ప్రతిమ, దివ్యసమాధి, పాదుకలను రకరకాల పూలతో అందంగా అలంకరించి పూజలు చేశారు. కార్యక్రమంలో బాపురావు సూర్యం, సిద్దిరాంరెడ్డి తదితరులున్నారు.

కోటి కుంకుమార్చనలో వాసవీ క్లబ్ మహిళలు



భిక్కనూరు : అక్షయ తృతీయ సందర్భంగా మహదేవ్ శక్తి సంస్థ నిర్వహణలో శిరాజయోగి కృష్ణస్వామిజీ వారి ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన కోటి కుంకుమార్చన కార్యక్రమంలో మండలంలోని జంగంపల్లి గ్రామానికి చెందిన వాసవి క్లబ్ మహిళలు పాల్గొన్నారు. గ్రామానికి చెందిన వాసవీ క్లబ్ మహిళలు హైదరాబాద్‌కు వెళ్లి అక్కడ 15వేల మహిళలతో నిర్వహించిన సామూహిక కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొని లక్ష్మీదేవికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామల దండకం, శ్యామల శతకం లలితాదేవి సహస్రనామాలను పఠించారు.

కులగణనతో ఆర్థిక అసమానతలు దూరం



బాన్సువాడ రూరల్ : దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టి దేశంలో సామాజిక, ఆర్థిక అసమానతలు దూరం చేయాలన్నదే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని బోర్లం గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు పి.శ్రావణి, సొసైటీ డైరెక్టర రాణి గొబ్బురు పేర్కొన్నారు. శుక్రవారం వారు బోర్లం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేపట్టి మాట్లాడారు. ప్రజాస్వామ్యం మనుగడ సాగించాలన్నా, రాజ్యాంగ పరిరక్షణ జరగాలన్నా కాంగ్రెస్‌ను గెలిపించు కోవడం అనివార్యమన్నారు.

కేంద్రంలో నిరంకుశ పాలన నశించాలి



కామారెడ్డి అర్బన్ : పదేళ్లుగా కేంద్రంలో మోదీ ఆధ్వర్యంలో నడుస్తున్న నిరంకుశ పాలన నశించాలని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా అధ్యక్షుడు జి జగన్నాథం అన్నారు. శుక్రవారం టీపీ జాక్ ఎన్నికల ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. ఎన్నికల ప్రచారంలో బీజేపీ నాయకులు ఆర్థిక వ్యవస్థ దివాళా, నిరుద్యోగం, ధరల పెరుగుదలను ప్రస్తావించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ వేదికల నాయకులు వీఎల్ నర్సింహారెడ్డి, కే వేణుగోపాల్, కే రమణ, శ్రీనివాస్, అంజయ్య, సంజీవరావు, శ్రీధర్, నరేందర్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

మరోసారి ప్రధాని మోదీనే..





తాడ్వాయిలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు, మహమ్మద్‌నగర్‌లో బైక్ ర్యాలీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో శుక్రవారం రాత్రి బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని జోరుగా నిర్వహించారు. తాడ్వాయి మండల కేంద్రంతోపాటు సంగోజీవాడి, కన్‌కల్, తదితర గ్రామాల్లో తిరుగుతూ బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్‌కు ఓటేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, నాయకులు హోటల్ శ్రీనివాస్, రాజిరెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్ నగర్ మండలంలోని బొగ్గుగుడిసె చౌరస్తా నుంచి శుక్రవారం బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో బాన్సువాడకు బైక్ ర్యాలీ నిర్వహించారు. బీజేపీనేత రాజాసింగ్ సభకు మద్దతుగా బీజేపీ నేత రాంప్రసాద్ ఆధ్వర్యంలో నిజాంసాగర్, మహమ్మద్‌నగర్, ఎల్లారెడ్డి మండలాలకు చెందిన బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

జోరుగా కాంగ్రెస్ ప్రచారం



చిట్యాలలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



గజ్యానాయక్ తండాలో..



కామారెడ్డిలో మాట్లాడుతున్న బెల్లయ్య నాయక్



బీబీపేటలో..

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమని పలువురు నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లావ్యాప్తంగా ఆయా మండలాల్లో, గ్రామాల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేశ్‌షెట్కార్‌కు మద్దతుగా ప్రచారం చేశారు.



భాగిర్తిపల్లిలో..



నిజాంసాగర్‌లో కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వడ్డేపల్లి సుభాష్ రెడ్డి

కాంగ్రెస్‌లో భారీ చేరికలు





షబ్బీర్‌అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న జమునా రాథోడ్, పార్టీలో చేరుతున్న వీరాపూర్ గ్రామస్తులు

కామారెడ్డి టౌన్ : బీఎస్పీ పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి జమునారాథోడ్ ఆ పార్టీకి రాజీనామా చేసి శుక్రవారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ సమక్షంలో పార్టీలో చేరారు. పట్టణానికి చెందిన జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు సిరిగాధ లక్ష్మీనర్సింలు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, కౌన్సిలర్ శివకృష్ణమూర్తి తదితరులున్నారు.

400 వందల మంది..

కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మండలంలోని ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ, జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేశ్‌షెట్కార్ ఆధ్వర్యంలో వైస్ ఎంపీపీ ఉరుదొండ నరేష్ సమక్షంలో 400 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండలంలోని లింగాయిపల్లికి చెందిన కురుమ సంఘం, ముదిరాజ్ సంఘం నుండి 100 మంది క్యాసంపల్లి తండా నుండి 150 మంది, నర్సన్నపల్లి నుండి 100 మంది, క్యాసంపల్లి నుండి 50 మంది చేరారు. మండల పార్టీ అధ్యక్షుడు గూడెం శ్రీనివాస్‌రెడ్డి, నిమ్మ మోహన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

బాన్సువాడలో..

బాన్సువాడ : బీర్కూర్ మండలం వీరాపూర్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు బోయిని శంకర్, కమలాకర్‌రెడ్డి, ప్రతాప్‌సింగ్, మాజీ సర్పంచి సాయిరాం తదితరులున్నారు.

కాంగ్రెస్ నేతల సంబురాలు



భిక్కనూరు : వడగండ్ల వర్షంతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం బ్యాంకు ఖాతాల్లో జమ అవడంతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం భిక్కనూరులో సంబురాలు నిర్వహించారు. మండల కేంద్రంలోని స్థానిక చౌరస్తా వద్ద పటాకులు కాల్చి రైతులకు, ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దుంపల మోహన్ రెడ్డి, అందే దయాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మైపాల్‌రెడ్డి, నీల అంజయ్య, సాజిద్, పూనూరి దయాకర్‌రెడ్డి, ఇస్సానిపేట రాజు తదితరులున్నారు.

బీఆర్ఎస్‌లో బీఎస్పీ నాయకుల చేరిక



భిక్కనూరు : మండల కేంద్రానికి చెందిన 18 మంది బీఎస్పీ నేతలు, కార్యకర్తలు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరందరికి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తున్కి వేణు, బీఆర్ఎస్ నేతలు అందే మహేందర్‌రెడ్డి, అంబల్ల మల్లేషం తదితరులున్నారు.

సంక్షిప్తం

కంటి వైద్య శిబిరం

పిట్లం(జుక్కల్) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో లయన్స్ క్లబ్ పిట్లం శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో కంటి వైద్యాధికారి భాస్కర్ రెడ్డి 80 మందికి కంటి వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కిషన్, కాశీరెడ్డి, గంగా శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, సంతోష్, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్లకు గ్రూప్ ఇన్సూరెన్స్ పెంపు

కామారెడ్డి అర్బన్ : ఎల్ఐసీ తన ఏజెంట్లకు సీనియారిటీ ప్రకారం ప్రీమియం చెల్లింపుపై అందించే గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని పెంచింది. వ్యాపారం సంబంధం లేకుండా లైసెన్స్ అమల్లో ఉన్న మూడేళ్లలోపు సీనియారిటీ ఉన్న ఏజెంట్లకు రూ. 5 లక్షలు, మూడు నుంచి ఐదేళ్ల లోపు ఏజెంట్లకు రూ. 7.50 లక్షలు, ఐదు నుంచి పదేళ్ల లోపు వారికి రూ.10 లక్షలు, పదేళ్ల సీనియారిటీ దాటిన ఏజెంట్లకు రూ.15 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం ఉంటుంది. ఈ కొత్త గ్రూప్ ఇన్సూరెన్స్ వచ్చే సెప్టెంబర్ 1వ తేది నుంచి అమల్లోకి వస్తుంది.

54వసారి యువకుడి రక్తదానం

రాజంపేట : మండల కేంద్రానికి చెందిన కమ్మరి శ్రీనివాస్ 54 వ సారి రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎవరైనా ఆపదలో ఉంటే రక్తదానం చేస్తానని ఆయన పేర్కొన్నారు.

సరస్వతి ఆలయంలో ప్రత్యేక పూజలు



కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని ఇల్చిపూర్ గ్రామ శివారులో కొలువుదీరిన శ్రీ సరస్వతి మాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు దత్తాద్రిశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమ అర్చనలు నిర్వహించారు. అష్టోత్తర శతనామాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత పార్శి విఠల్ పటేల్ కోలల సిద్దాగౌడ్, రొండ్ల నారాయణరెడ్డి, మహేష్, భక్తులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి ముదిరాజ్ సంఘం సభ్యులు



మాచారెడ్డి : మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సమక్షంలో మండలంలోని కొత్తపల్లి గ్రామ ముదిరాజ్ సంఘం సభ్యులు శుక్రవారం బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మినుకూరి రాంరెడ్డి,మండల శాఖ అధ్యక్షుడు బాల్ చంద్రం,ప్రధాన కార్యదర్శి రాజాగౌడ్, ముదిరాజ్ సంఘం సభ్యులు ఉన్నారు.